జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

శుక్రవారం | 09-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 804 పేజీలు: 4 వెల: రూ.7

## మోడల్ పట్టణంగా.. పలాస-కాశీబుగ్గను..
# తీర్చిదిద్దుతాం



- జిల్లా కేంద్రాన్ని తలదన్నేలా అభివృద్ధి చేస్తాం
- ప్రతి ఇంటికీ నిరంతర తాగునీరు
- డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- నేరేడు బ్యారేజీని రెండేళ్లలో పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు
- రూ.121.99 కోట్ల మంచినీటి పథకం
- రూ.5 కోట్ల సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం
- రూ.46.23 కోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

పలాస, అక్టోబర్ 8 (ప్రశ్నించే వార్త): పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలు, మహిళలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి, ఆధునిక మౌలిక వసతులతో మున్సిపాలిటీని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి గురువారం పలాస-కాశీబుగ్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ పట్టణంలోని ప్రతి ఇంటికీ 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రూ.121.99 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే సమగ్ర మంచినీటి సరఫరా అభివృద్ధి పథకానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువచ్చి సూదికొండతోపాటు అవసరమైన ప్రాంతాల్లో నీటి ట్యాంకులు నిర్మించి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సరఫరా చేస్తామని వివరించారు. పట్టణంలోని వార్డులు, మురికివాడల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) నిధులతో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. పలాస-పూండి రైల్వే స్టేషన్ల మధ్య ఎల్.సి. స్థానంలో రూ.46.23 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించామని తెలిపారు. రైల్వే క్రాసింగ్ వద్ద వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ వంతెనతో పరిష్కారం లభిస్తుందన్నారు. దసరా నాటికి పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యేలా మిగిలిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పనులు మరో మూడు నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున వంతెన పనులు ముగింపు దశకు చేరగానే ప్రారంభించామన్నారు. ఫ్లైఓవర్ నుంచి జాతీయ రహదారి వరకు రహదారిని విస్తరించి, డబుల్ రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ తరహాలో పలాస-కాశీబుగ్గను ఆధునికంగా, సుందరంగా అభివృద్ధి చేస్తామని, ప్రత్యేకంగా జిల్లా కేంద్ర హోదా అవసరం లేకుండానే జిల్లా కేంద్రాన్ని తలదన్నే స్థాయిలో మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం తీవ్ర ఆర్థిక లోటు, రాజధాని లేని క్లిష్ట పరిస్థితుల్లోనూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరిగిన అభివృద్ధితో 2014-2019 పాలన రాష్ట్ర చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలు 2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఘన విజయాన్ని అందించారని చెప్పారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు చెల్లించడంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో చర్యలు చేపట్టామని తెలిపారు. కేంద్రంలో కూటమి ఎంపీల బలమైన ప్రాతినిధ్యం, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, చంద్రబాబు నాయుడు కృషితో రాష్ట్రానికి అవసరమైన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులను సాధిస్తున్నామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగితేనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందన్నారు. 53 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పటికీ పలాస, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు ప్రాంతాల్లోని చివరి ఆయకట్టు భూములకూ వంశధార నీటిని అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల వర్షాలతో వంశధార రిజర్వాయర్‌లోకి సుమారు 6 టీఎంసీల నీరు చేరిందన్నారు. పలాసలో రైతు బజార్ ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ స్థలానికి అనుమతులు సాధించి, వ్యవసాయ శాఖ మంత్రిగా తాను రూ.70 లక్షలు మంజూరు చేశానని అచ్చెన్నాయుడు వివరించారు. పలాస ప్రజలకు ప్రపంచంలోని అందరికీ ఉన్న 24 గంటల్లో ఒక గంట ఈ రైల్వే గేటు దగ్గరే గడిచిపోయేది. అందుకే ప్రపంచంలో అందరికీ రోజుకు 24 గంటలు ఉంటే.. పలాస ప్రజలకు మాత్రం 23 గంటలే ఉండేవి. ఈ రోజు మీ సమయాన్ని మీకు తిరిగి ఇస్తున్నాం" అని రామ్మోహన్ నాయుడు అన్నారు. పలాస నియోజకవర్గానికి గత రెండేళ్లలో రూ.కోటిన్నర కోట్లకు పైగా ఎంపీ లాడ్స్ నిధులు ఖర్చు చేశామని, కిడ్నీ వ్యాధుల నివారణకు కూడా చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు. పలాస రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.40 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. గతంలో ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం మధ్య ఏడు రైల్వే స్టేషన్లను విశాఖపట్నం డివిజన్‌లోకి తీసుకురావడానికి పోరాటం చేసి సాధించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలాస శాసన సభ్యులు గౌతు శిరీష , మాజీ శాసనసభ్యుడు గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, తదితరులు, పాల్గొన్నారు.





## యువకుడ్ని కాటేసిన
# కిడ్నీ మహమ్మారి

* బొర్ర పుట్టుగలో ఒకరి మృతి



కవిటి, అక్టోబర్ 8 (వార్త): కవిటి మండలం బొర్ర పుట్టుగ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఓ యువకుడ్ని కిడ్నీ మహమ్మారి కాటేసింది. ఐదారేళ్లుగా ఈ వ్యాధితో బాధపడుతున్న బైరెడ్ల లోకనాథం (44) బుధవారం రాత్రి తనువు చాలించాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్న లోకనాథం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అనేకచోట్ల వైద్యం పొందుతూ కొద్ది కాలం పాటు తన వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాన్ని ఏదో విధంగా నెట్టుకు వస్తున్నాడు. వ్యాధి తీవ్రం కావడంతో మంచం పట్టిన లోకనాథం చివరి మూడేళ్లు కవిటిలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతూ కొంత ఉపశమనం పొందినప్పటికీ చివరిలో వచ్చిన సమస్య ఆయన ప్రాణాన్ని తోడేసింది. కొద్ది రోజుల క్రితం ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో దగ్గరలో ఉన్న ఒడిశా బరంపురం గవర్నమెంట్ మెడికల్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. బ్రెయిన్ స్ట్రోక్ కు గురవడంతో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పేద కుటుంబీకులు చేసేదేమీ లేక కొనఊపిరితో లోకనాథంను స్వగ్రామానికి తీసుకువచ్చారు. వెంటిలేటర్ పైనే చివరి క్షణం వరకు గడిపిన ఆయన బుధవారం రాత్రి మరణించడం పట్ల గ్రామంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య ప్రభావతి తో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

* అందుబాటులో పోలింగ్ సామగ్రి * సాంకేతిక ప్రక్రియలను ఇప్పటికే పూర్తి చేశాం * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, అక్టోబర్8 (వార్త): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శక వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా యంత్రాంగంతో పాటు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి, బ్యాలెట్ బాక్సుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేవని వివరించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు సంబంధించి ప్రింటింగ్ ప్రెస్‌ల గుర్తింపు సహా అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను ఇప్పటికే పూర్తి చేశామని పేర్కొన్నారు. మొదటి విడతలో పోలింగ్ జరగనున్న పంచాయతీల జాబితాను ఇప్పటికే సరిచూశామని, ఏవైనా స్వల్ప మార్పులు ఉంటే తదుపరి 24 గంటల్లోగా తుది నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతామని కలెక్టర్ వెల్లడించారు.



క్షేత్రస్థాయిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండ్యా, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.






## జేసీ ఫర్మాన్
# అహ్మద్ ఖాన్ బదిలీ

శ్రీకాకుళం, అక్టోబర్ 8 (వార్త): శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు బదిలీ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఫర్మాన్ అహ్మద్ ఖాన్ 2024 జూలై 26వ తేదీన జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ప్రస్తుతం ఆర్థిక శాఖలో ప్రభుత్వ ఉప కార్యదర్శిగా నియమించారు. ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లాలో భూ సేకరణను సమర్థంగా నిర్వహించిన పేరు గడించారు. ఆర్‌వోఆర్ కేసుల పరిష్కారం, సివిల్ సప్లై విధుల్లో ఆయన ప్రత్యేక ముద్రను వేసుకున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మత్స్యకారుల సంక్షేమానికి మరో ముందడుగు

## - దేవునల్తాడలో రూ.1.32 కోట్లతో చేపల వేలం హాల్, శుద్ధి కేంద్రం ప్రారంభం




**పలాస, అక్టోబరు 8 (వార్త):** మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామంలో రూ. 1.32 కోట్ల వ్యయంతో నిర్మించిన చేపల వేలం హాల్, చేపల శుద్ధి కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్స్యకారులకు ప్రాణరక్షణ కిట్లను పంపిణీ చేశారు.

సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్న దేవునల్తాడతో పాటు పరిసర ప్రాంతాల మత్స్యకారులకు ఈ సదుపాయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు చేపల విక్రయం, వేలం, శుద్ధి తదితర అంశాల్లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించి, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. చేపల వేలం హాల్ అందుబాటులోకి రావడంతో మత్స్యకారులు సముద్రం నుంచి తీసుకొచ్చిన చేపలను క్రమబద్ధమైన వాతావరణంలో వేలం వేసి విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దీనివల్ల చేపల విక్రయ ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు మత్స్యకారులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. చేపల శుద్ధి కేంద్రం ద్వారా పట్టుకొచ్చిన చేపలను పరిశుభ్రమైన పద్ధతుల్లో శుద్ధి చేసి మార్కెట్లకు తరలించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. చేపల నాణ్యతను కాపాడుకోవడంతో పాటు నిల్వ, శుద్ధి, రవాణా, విక్రయ ప్రక్రియలను మెరుగుపరచడం ద్వారా మత్స్యకారుల సమయం, వ్యయాన్ని తగ్గించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని వివరించారు. మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడం, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, తీరప్రాంత గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం ప్రభుత్వాల లక్ష్యమని రామ్మోహన్ నాయుడు తెలిపారు. మత్స్య రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారుల భద్రతకు కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గత పాలనలో రాష్ట్రం తీవ్రంగా వెనుకబడిందని విమర్శించిన ఆయన, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన, సుందరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ, తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గత ఎన్నికల సమయంలో దేవునల్తాడకు వచ్చినప్పుడు కొందరు తనను రాళ్లతో భయపెట్టే ప్రయత్నం చేశారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రజలు ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రస్తుతం మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడంతో పాటు తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, మత్స్యకారులకు అవసరమైన సదుపాయాలను దశలవారీగా పెంచుతూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు కొనసాగిస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్యనాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణి వారోత్సవాలు



**మందస, అక్టోబరు 8(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో మందస మండలంలోని బంసుగాం, సిరిపురంలలో వన్యప్రాణి వారోత్సవాలు జరిగాయి. ప్రతీ సంవత్సరం అక్టోబర్ 2 నుండి 8వ తేదీ వరకు జరిగే వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.మురళీకృష్ణ ఆదేశాల మేరకు మందస మండలంలో బంసుగాం గ్రామంలో జీటీడబ్ల్యు స్కూల్, సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి టి.దేవరాజు మాట్లాడుతూ అటవీ జంతువులు రక్షించి నపుడే అడవులు పరిపూర్ణంగా పెరిగి పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. వన్యప్రాణులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అడవుల ప్రాధాన్యతను వివరించి, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.డొంబురు, నగిరి తారకేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, బీట్ ఆఫీసర్ లు ఎస్. దుర్గాదేవి, టి.వెంకటేశ్వరరావు, పి.లక్ష్మణమూర్తి, పి.భానుమూర్తి, ఆర్.జోగారావు, డి.సురేష్, ఆయా గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు మందసలో శ్రీచక్రపెరుమాళ్ భక్తిరంజని




**మందస, అక్టోబరు 8(వార్త):** మందస పట్టణంలోని శ్రీకిల్లమ్మతల్లి ఆలయంలో ఆవరణలో శ్రీచక్రపెరుమాళ్ భక్తిరంజని కార్యక్రమం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కిల్లమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శ్రీ చక్ర పెరుమాళ్ భక్తి రంజని కళాకారులు పొందల శ్రీనివాస్(గాత్రం), హేమంత్ కుమార్(కీబోర్డు), కూర్మారావు (తబలా), శంకర్(డీటీఎస్ మిక్సింగ్) సంకీర్తనలు ఉంటాయన్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని భక్తులు, ప్రజలు విజయవంతం చేయాలని వారు కోరారు.

## సవరకొంకడాపుట్టిలో గ్రామకంఠం ఆక్రమణ

### -అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



**మందస, అక్టోబరు 8(వార్త):** సవరకొంకడపుట్టిలో గ్రామకంఠం ఆక్రమణ జరిగిందని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీలోని సవరకొంకడాపుట్టి గ్రామంలో సుమారు 32 గిరిజన కుటుంబాలున్నాయన్నారు. 10సంవత్సరాల క్రితం 5సెంట్ల భూమిని అంగన్ వాడీ భవన నిర్మాణానికి గ్రామస్తులు స్థలాన్ని కేటాయించుకున్నామన్నారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని సవర నాగేంద్ర అనే వ్యక్తి షెడ్డు నిర్మించుకున్నాడన్నారు. గతంలో బురుసాయి గ్రామం నుండి సవరకొంకడాపుట్టి గ్రామం వరకు కొంతమేర కంకర రహదారిని కూడా తన స్థలంలో కలుపుకొన్నాడని ఆరోపించారు. గ్రామంలో జరిగిన ఆక్రమణలపై దర్యాప్తు చేయాలని వారు కోరారు. అంగన్ వాడీ భవన నిర్మాణానికి కేటాయించిన ఖాళీ స్థలంలో ఉన్న ఆక్రమణను తొలగించాలని, గిరిజనుల సామాజిక అవసరమైన అంగన్ వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మందస తహసీల్దార్ లకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సవర నారాయణరావు, సవర ఆనందరావు, సవర నర్సింహులు, సవర లోకనాథం, సవర రమణారావు, సవర గౌరిలతో పాటు గ్రామస్తులు కూడా ఉన్నారు.

## సామాజిక సేవల్లో కూడా ముందుంటాం

### - క్షేత్ర సహాయకుల మండల అధ్యక్షుడు చాణిక్య

**మెళియాపుట్టి, అక్టోబరు 8(వార్త):** గ్రామాలలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులు తమ విధులు నిర్వర్తించడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి సేవ చేయడం జరుగుతుందని క్షేత్ర సహాయకుల మండల అధ్యక్షులు శ్రీరామ్ చాణిక్య అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాం చాణిక్య, ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావుల నేతృత్వంలో విబిజి, రామ్ జి కార్యక్రమంలో భాగంగా మండలంలో గల మాకనాపల్లి గ్రామంలో గురువారం నాడు స్థానికంగా ఉన్న మండల పరిషత్ పాఠశాల ఆవరణలో శుభ్రం చేసి, పరిసరాలను ఫీల్డ్ అసిస్టెంట్ల పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా యొక్క క్షేత్ర సహాయకుల విధులు నిర్వర్తిస్తూనే నెల కుమారు ఓ గ్రామాన్ని ఎంచుకొని సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, ఆయా గ్రామలలో పలు పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం చాణక్య తోపాటు ఉపాధ్యక్షులు జగదీశ్వరరావు, ఏపీవో తెంబూరు రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి లొడగల శ్రీనివాసరావు, రాజు మజ్జి, బొల్ల సింహాచలం, అదపాకల మోహనరావు, గ్రామస్తులు, విద్యార్థులు క్షేత్ర సహాయకులు మెట్లు, గ్రామ ప్రజలు తదితరులున్నారు.



# శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు లేదు

### - మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**పాతపట్నం, అక్టోబరు 8 (వార్త) :** తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీ నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు కలవలేదని సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన అనుబంధ ఛార్జిషీట్‌లో స్పష్టం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భక్తులకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై, వైకాపా ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా కూటమి నాయకులు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. నెల్లూరు ఏసీబీ కోర్టులో సీబీఐ సిట్ సమర్పించిన అనుబంధ ఛార్జిషీట్‌తో చంద్రబాబు రాజకీయ కుట్రలు మరోసారి పటాపంచలయ్యాయని తెలిపారు. ఏఆర్ డెయిరీకి చెందిన నెయ్యి ట్యాంకర్ల నుంచి సేకరించిన నమూనాలను హరియాణాలోని 'నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఎన్డీఆర్ఐ) ల్యాబ్‌లో పరీక్షించగా అందులో ఎలాంటి జంతు కొవ్వులు లేవని స్పష్టమైందని ఆమె వివరించారు. గుజరాత్‌లోని ఎన్డీడీబీ నివేదిక ఆధారంగా చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని సిట్ నివేదిక తేటతెల్లం చేసిందన్నారు. అధికారబలంతో సత్యాన్ని కొన్నిరోజులు దాచగలరేమో కానీ శాశ్వతంగా నొక్కేయలేరని, భక్తులకు కలిగించిన మానసిక క్షోభకు చంద్రబాబు పశ్చాత్తాపం వ్యక్తం చేయాల్సిందేనని రెడ్డి శాంతి స్పష్టం చేశారు.

## నీలమణి దుర్గా హుండీ ఆదాయం రూ.2,98,281లు



**పాతపట్నం, అక్టోబరు 8 (వార్త) :** పాతపట్నంలోని ప్రముఖ దేవాలయం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ధర్మ హుండీలను గురువారం ఆలయ ప్రాంగణంలో అధికారులు, ధర్మకర్తల సమక్షంలో తెరిచి లెక్కించారు. గత 29 రోజులకు గాను అమ్మవారికి హుండీ ద్వారా మొత్తం 2,98,281 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీముఖలింగం గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి కె ఏడుకొండలు, ఆలయ కార్యనిర్వహణాధికారి టి వాసుదేవరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అక్కంధ్ర సన్యాసి రావు, సభ్యులు ఉమా శంకర మిశ్రో, ఎ శ్రావణి, ఎస్ బుల్లిబాబు, దాసరి వెంకటరమణ, పి ఢిల్లీశ్వరరావు, బి గోపాలరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం



కష్టపడిన కార్యకర్తలకు ఘన సన్మానం

**మందస, అక్టోబరు 8(వార్త):** కష్టపడే ప్రతీ కార్యకర్తలకు గుర్తింపులో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష, తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి ఘనంగా సన్మానించారు. కార్యకర్తలే పార్టీకి పునాదులని, ఆత్మీయ గౌరవం అందించారు. దీనిలో భాగంగా 112 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఘనంగా సన్మానించారు. విశాఖపట్నంలోని భోగాపురంలోని ఓ రిసార్ట్ లో వీరికి సత్కరించారు. మందస మండలంలోని భైరిసారంపురం పంచాయతీలో గల రాధాకృష్ణపురం గ్రామానికి చెందిన పోలాకి భాస్కరరావును కూడా ఎంఎల్ఏ గౌతు శిరీషా, పార్టీ సమన్వయకర్త వెంకన్నచౌదరి చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు దక్కిందని, తనకు జరిగిన సన్మానానికి ఎంఎల్ఏ శిరీషా, వెంకన్నచౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాశీబుగ్గ ఆర్వోబీ నిర్మాణంపై .. వాస్తవాలు బయట పెట్టాలి

### -- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి

### - తమ హయాంలో స్థల సేకరణ, నిర్వాసితుల పునరావాసంతో ముందుకు సాగిన నిర్మాణ పనులని స్పష్టీకరణ




**పలాస, అక్టోబరు 8 (వార్త):** కాశీబుగ్గ వంతెన నిర్మాణంపై వాస్తవాలు బయట పెట్టాలని, పలాస-కాశీబుగ్గ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కాశీబుగ్గ రైల్వే పైవంతెన నిర్మాణం వెనుక అనేక సంవత్సరాల కృషి, స్థల సేకరణ ప్రక్రియ, న్యాయపరమైన వివాదాలు, నిర్వాసితుల పునరావాసం వంటి పలు అంశాలు ఉన్నాయని మాజీ మంత్రి, డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన పూర్తి కాలక్రమాన్ని, అధికారిక రికార్డులను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందన్నారు.

2007లో దివంగత నేత హనుమంతు అప్పయ్యదొర హయాంలో కాశీబుగ్గతో పాటు బెండి రైల్వే పైవంతెనలకు మంజూరు లభించిందని తెలిపారు. బెండి పైవంతెన నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటికీ, కాశీబుగ్గ వంతెనకు స్థల సేకరణలో ఎదురైన సమస్యల కారణంగా పనులు దీర్ఘకాలం ఆలస్యమయ్యాయని తెలిపారు.

వంతెనకు ఇరువైపులా నివాసాలు, వ్యాపార సముదాయాలు, ప్రజల జీవనాధారానికి సంబంధించిన స్థలాలు ఉండటంతో భూసేకరణ ప్రక్రియ క్లిష్టంగా మారిందన్నారు. పరిహారం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడం, కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించడం వంటి కారణాలతో నిర్మాణ ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని వివరించారు. 2021--22 ప్రాంతంలో స్థల సేకరణ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అప్పలరాజు తెలిపారు. నిర్వాసితులతో చర్చలు జరిపి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, అధికారులతో సమన్వయం చేసి పరిహారం, పునరావాస చర్యలను ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇళ్లు, వ్యాపార స్థలాలు కోల్పోతున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలాల కల్పన, నష్టపరిహారం వంటి అంశాలపై చర్యలు చేపట్టడంతో స్థల సేకరణ ప్రక్రియ వేగం పుంజుకుందని చెప్పారు. స్థల సేకరణ పూర్తయిన తర్వాతే వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రాంతం అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు.

### ఉపగ్రహ చిత్రాల్లోనూ మార్పులు స్పష్టం

వంతెన నిర్మాణ ప్రాంతంలో కాలక్రమేణా చోటుచేసుకున్న మార్పులు ఉపగ్రహ చిత్రాల్లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయని అప్పలరాజు తెలిపారు. 2020 ఏప్రిల్ నాటికి ఇళ్లు, ఇతర నిర్మాణాలతో ఉన్న ప్రాంతం అనంతరం ఖాళీ చేయబడినట్లు, 2020 నవంబరు, 2021 జూన్, 2022 ఏప్రిల్, 2022 నవంబరు నాటి చిత్రాల్లో నిర్మాణ పనులు దశలవారీగా ముందుకు సాగినట్లు కనిపిస్తోందన్నారు. చిన్నబడం వైపు, కాశీబుగ్గ వైపు నిర్మాణ పనులు క్రమంగా వేగం పుంజుకుని 2024 ఫిబ్రవరి నాటికి గణనీయమైన మేరకు పూర్తయినట్లు తెలిపారు.

### అధికారిక రికార్డులే ఆధారం

ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన మౌలిక వసతుల నిర్మాణంలో కేవలం నిర్మాణ పనులనే కాకుండా, వాటికి ఎదురయ్యే భూసేకరణ, సామాజిక, పునరావాస సమస్యల పరిష్కారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ రైల్వే పైవంతెనకు సంబంధించిన మంజూరు, స్థల సేకరణ, పరిహారం, నిర్వాసితుల పునరావాసం, నిర్మాణ పనుల పురోగతికి సంబంధించిన పూర్తి కాలక్రమాన్ని అధికారిక రికార్డులతో సహా ప్రజలకు అందుబాటులో ఉంచితే వాస్తవ పరిస్థితులు మరింత స్పష్టమవుతాయని చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రచారానికి కాకుండా అధికారిక పత్రాలు, పనుల పురోగతి, సంబంధిత ఆధారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## ఘనంగా మాదిని జన్మదిన వేడుకలు




**కంచిలి, అక్టోబరు 8 (వార్త):** కంచిలి మండలం టిడిపి అధ్యక్షుడు మాదిని రామారావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు సమక్షంలో పెద్ద శ్రీరాంపురం గ్రామంలో బర్తడే కేక్ కట్ చేసి అనేకమంది శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో చల్లగా కలకాలం వర్ధిల్లాలని అభిమానులు ఆశీస్సులు అందించారు.

## రొంపివలస పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్

### -1995-96 పదో తరగతి విద్యార్థుల వితరణ




**పాతపట్నం, అక్టోబరు 8 (వార్త) :** రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మౌలిక వసతుల కల్పనలో భాగంగా సుమారు 70 వేల రూపాయల వ్యయంతో అత్యాధునిక ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం మండల విద్యాశాఖాధికారులు గోవిందరావు, తిరుమలరావు ఈ ప్లాంట్ ను ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు చేసిన ఈ కృషిని అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, నాటి విద్యార్థుల నాయకులు గొట్టిపల్లి శ్రీధర్, మోహన్‌రావు, రామారావు, ప్రసాద్‌రావు, ఫాల్గుణరావు, సంజీవరావు, పారసెల్లి ప్రసాద్‌లతో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ కుమారస్వామి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పూర్వ విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఎన్టీఆర్ ఆశయాలే స్ఫూర్తి

- పెద్ద మురహరిపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ
- గ్రామాభివృద్ధికి గ్రంథాలయం, క్రీడా స్థలం ఏర్పాటు

**మురహరిపురం--మంచినీళ్లపేట రహదారి అభివృద్ధికి కేంద్ర మంత్రి హామీ హామీ**



**పలాస, అక్టోబరు 8 (వార్త):** తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలే తమకు స్ఫూర్తి అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్ద మురహరిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ పెద్ద మురహరిపురం తెలుగుదేశం పార్టీకి బలమైన ఆధారంగా నిలిచిన గ్రామమని అన్నారు. పార్టీపై గ్రామ ప్రజలు చూపిస్తున్న అభిమానం, ఆదరణ మరువలేనిదని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తల సేవలను అభినందించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో పయనిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం ద్వారా ఆయన సేవలను స్మరించుకునే అవకాశం లభించిందని చెప్పారు. యువత ఎన్టీఆర్ జీవితాన్ని, ప్రజాసేవను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష చేస్తున్న కృషిని రామ్మోహన్‌నాయుడు అభినందించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, విద్య, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పలాస ప్రాంత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. పెద్ద మురహరిపురం గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం, క్రీడా స్థలం ఏర్పాటు చేయడంతో పాటు యువతకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మురహరిపురం--మంచినీళ్లపేట రహదారి అభివృద్ధికి కూడా చర్యలు చేపడతామని తెలిపారు. మెరుగైన రహదారి సదుపాయాలు అందుబాటులోకి వస్తే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయం, వ్యాపారం, ఉపాధి అవకాశాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, విద్య, పారిశుద్ధ్యం, క్రీడా సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. పెద్ద మురహరిపురం ప్రజల అవసరాలు, ఆకాంక్షలను దశలవారీగా పరిష్కరించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పలాస-కాశీబుగ్గ వంతెనపై కూటమి క్రెడిట్ చోరీ

- అప్పయ్యదొర కన్న కల.. అప్పలరాజు హయాంలో వేగం
- వైసీపీ నాయకుడు బమ్మిడి దుర్యోధనరావు



**పలాస, అక్టోబరు 8 (వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలకు దశాబ్దాలుగా ఇబ్బందులు కలిగిస్తున్న రైల్వే గేటు సమస్యకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన వంతెన నిర్మాణానికి సంబంధించి కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం క్రెడిట్ దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు విమర్శించారు. వంతెన నిర్మాణ చరిత్ర, స్థల సేకరణ, నిర్వాసితుల పునరావాసం, నిర్మాణ పురోగతికి సంబంధించిన వివరాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం పలాసలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణ ఆలోచన 2006లోనే అప్పటి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర హయాంలో ప్రారంభమైందన్నారు. 2007లో బెండి వంతెనతో పాటు కాశీబుగ్గ వంతెనకు మంజూరు లభించిందని, 2008లో శంకుస్థాపన జరిగిందని తెలిపారు. అప్పట్లో వంతెన నిర్మాణానికి రూ.28 కోట్ల అంచనా వ్యయం ఉండగా, రైల్వే శాఖ రూ.8.50 కోట్లు, రహదారులు--భవనాల శాఖ రూ.19.50 కోట్లు కేటాయించిందన్నారు. వంతెన నిర్మాణానికి ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణాలు, జీవనాధార స్థలాల తొలగింపు ప్రధాన అడ్డంకిగా మారిందని తెలిపారు. నష్టపరిహారం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పాటు కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయని వివరించారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి ముందుకు సాగలేదన్నారు. వంతెన నిర్మాణ పురోగతికి ఉపగ్రహ చిత్రాలే ఆధారమని బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు. కూటమి ప్రజాప్రతినిధులకు నిజమైన చిత్తశుద్ధి ఉంటే వజ్రపుకొత్తూరు మండలంలోని తాళ్లభద్ర రైల్వే గేటు వద్ద కూడా వంతెన నిర్మించి చూపాలని బమ్మిడి దుర్యోధనరావు సవాల్ చేశారు. ఆ ప్రాంత ప్రజలు రైల్వే గేటు కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెండేళ్లలో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. పలాస-కాశీబుగ్గ వంతెన నిర్మాణ చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు.

## బాధితుడికి వాడరేవు కృష్ణ భరోసా

- వారం రోజుల్లో రేకుల షెడ్ నిర్మిస్తామని హామీ



**సంతబొమ్మాళి, అక్టోబరు 8 (వార్త):** షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన నౌపడ గ్రామానికి చెందిన వికలాంగుడు కర్రి నాగరాజును టీడీపీ సీనియర్ నాయకుడు వాడరేవు కృష్ణ గురువారం పరామర్శించారు. అగ్నిప్రమాదంలో నగదు, బడ్డీలోని సామగ్రి పూర్తిగా కాలిపోయి తీవ్రంగా నష్టపోయిన నాగరాజు పరిస్థితిని తెలుసుకుని ఆయనకు అండగా నిలిచారు. ప్రమాదం కారణంగా నాగరాజు నివాసం ఉండేందుకు కూడా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన వాడరేవు కృష్ణ, వారం రోజుల్లోనే ఇటుక గోడలతో రేకుల షెడ్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇకపై వర్షం, ఎండకు ఇబ్బందులు పడకుండా నివాసానికి అనువైన వసతి కల్పిస్తామని బాధితుడికి భరోసా కల్పించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాగరాజును ఆదుకునేందుకు ప్రభుత్వం కూడా అవసరమైన సహాయం అందించాలని ఆయన కోరారు. బాధితుడి పరిస్థితిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. తనకు అండగా నిలిచి నివాస వసతి కల్పించేందుకు ముందుకు వచ్చిన వాడరేవు కృష్ణకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి, కర్రి శంకర్ రెడ్డి, సుగ్గు చిన్నా రెడ్డి, కర్రి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సారవకోటలో రోడ్డు ప్రమాదం.. విద్యార్థికి గాయాలు

- ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థిని ఢీకొట్టిన కారు
- క్షతగాత్రుడిని తక్షణమే ఆసుపత్రికి తరలించిన డ్రైవర్

**సారవకోట, అక్టోబరు 8 (వార్త):** సారవకోట గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థి తంగుడు లిఖిత్ గాయపడ్డాడు. గ్రామంలో ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో పాతపట్నం వైపు నుంచి వస్తున్న కారు విద్యార్థిని ఢీకొట్టింది. ప్రమాదంలో లిఖిత్‌కు గాయాలు కావడంతో విషయం గమనించిన కారు డ్రైవర్ వెంటనే స్పందించాడు. ఆలస్యం చేయకుండా గాయపడిన విద్యార్థిని అదే కారులో నరసన్నపేట ఆసుపత్రికి తరలించి వైద్యం అందించేలా చర్యలు చేపట్టాడు. ప్రమాద ఘటనతో గ్రామంలో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. గాయపడిన విద్యార్థిని సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



## పాతపట్నంలో ఘనంగా సేవా జ్యోతి యాత్ర



**పాతపట్నం, అక్టోబరు 8 (వార్త) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో "సేవా జ్యోతి యాత్ర" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్డీయే కూటమి శ్రేణులు ఉత్సాహభరితమైన బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతపట్నం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ యాత్ర స్థానిక తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రారంభమై కోర్టు కూడలి వరకు ఉత్సాహంగా సాగింది. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా గత 25 ఏళ్లుగా దేశ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని మోదీ సేవలు దేశ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచడంలో ఆయన నాయకత్వం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సుదీర్ఘ ప్రజాసేవకు అభినందనలు తెలుపుతూ చేపట్టిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, బీజేపీ నాయకులు డాక్టర్ సలాన శరత్, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు యువత పాల్గొన్నారు.

## డాక్టర్ రాజేశ్వరరావుకు పట్టాభిరామ్ అవార్డు




**పాతపట్నం, అక్టోబరు 8 (వార్త) :** మానసిక శాస్త్ర రంగంలో పాతికేళ్లకు పైగా విశేష సేవలందిస్తున్న పాతపట్నంకు చెందిన సీనియర్ సైకాలజిస్ట్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ డాక్టర్ గోకవలస రాజేశ్వరరావు ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బి వి పట్టాభిరామ్ మెమోరియల్ నేషనల్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మానసిక ఆరోగ్య వారోత్సవాల కార్యక్రమంలో రాజేశ్వరరావుకి ఈ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. విద్య, మానసిక ఆరోగ్యం, యువతలో అవగాహన, ఆత్మహత్యల నివారణ మరియు మానసిక శాస్త్ర రచనా రంగాల్లో ఆయన చేసిన నిరంతర కృషికి గాను ఈ అవార్డు లభించింది. మానసిక శాస్త్రంలో రెండు పీహెచ్‌డీలు సాధించిన ఆయన, గత మూడు దశాబ్దాలుగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ద్వారా విద్యాసేవలు కూడా అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మానసిక శాస్త్రం అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, మనిషి ఆలోచనలను, భావోద్వేగాలను అర్థం చేసుకుని జీవితాన్ని సార్థకం చేసే సాధనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, పరీక్షల భయం, వైఫల్యాలను అధిగమించేలా గత ఐదేళ్లుగా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని, శాస్త్రీయ దృక్పథంతో సమస్యలను ఎదుర్కొని జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పురస్కారం సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు. పాతపట్నం కి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు రాజేశ్వరరావుకు అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్ర అండర్-16 క్రికెట్ జట్టుకు సాత్విక్ ఎంపిక

- నరసన్నపేట ఏసీఏ సబ్ సెంటర్ నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక
- చండీగఢ్‌లో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొననున్న సాత్విక్
- సాత్విక్‌ను అభినందించిన వైఎంసీఏ జిల్లా కార్యదర్శి గొద్దు చిట్టిబాబు




**నరసన్నపేట, అక్టోబరు 8 (వార్త):** నరసన్నపేట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న శిమ్మ సాత్విక్ రాష్ట్ర అండర్-16 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. స్థానికంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు, శిక్షకులు హర్షం వ్యక్తం చేశారు. నరసన్నపేట జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎంసీఏ జిల్లా కార్యదర్శి గొద్దు చిట్టిబాబు సాత్విక్‌ను అభినందించారు. ఏసీఏ సబ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటూ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. సాత్విక్ తన ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో సాధన చేస్తే మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి చండీగఢ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర అండర్-16 క్రికెట్ పోటీల్లో సాత్విక్ పాల్గొననున్నట్లు చిట్టిబాబు తెలిపారు. స్థానికంగా శిక్షణ పొందిన క్రీడాకారుడు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంతో నరసన్నపేట ఏసీఏ సబ్ సెంటర్ ప్రతినిధులు, క్రీడాకారులు, పలువురు క్రీడాభిమానులు సాత్విక్‌కు అభినందనలు తెలిపారు.

## కళ్ల ఆరోగ్యంపై అవగాహన

- మొబైల్ ఫోన్లు, టీవీ వినియోగాన్ని తగ్గించాలి
- ఆకుకూరలు, క్యారెట్ వంటి పోషకాహారం తీసుకోవాలని పిలుపు




**పోలాకి, అక్టోబరు 8 (వార్త):** పంచేంద్రియాల్లో అత్యంత ముఖ్యమైన కళ్లను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా సంరక్షించుకోవాలని పారామెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ సాంబశివరావు సూచించారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సమస్యలను ముందుగానే గుర్తించాల్సిన అవసరంపై ఆయన వివరించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్లు, టీవీల వినియోగం అధికంగా ఉండటంతో కళ్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అవసరానికి మించి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించకుండా, మధ్య మధ్యలో కళ్లకు విశ్రాంతి కల్పించాలని సూచించారు. కంటి ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో అవసరమని పేర్కొంటూ ఆకుకూరలు, క్యారెట్ వంటి కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కంటి చూపులో మార్పులు, అసౌకర్యం లేదా ఇతర సమస్యలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రోగులకు కంటి ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు.

## కొఠారిలో పాసు పుస్తకాల పంపిణీ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 8(వార్త):** కొఠారి రెవిన్యూ గ్రామంలో రాజముద్ర తో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎన్. వెంకటరావు అధ్యక్షతన మాజీ ఏ ఎం సి చైర్మన్ సాడి సహాదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు కు రాజముద్ర తోకూడిన పట్టాదారు పసుపుస్తకాలు పంపిణీ చేపట్టరు. ఈ కార్యక్రమం లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎల్.పద్మనాభం,పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, పి. దుర్యోధన, పరసరామ్, మాధవరావు, ఇ. సారధి, పి చంద్రశేఖర్, ప్రకాష్ చంద్రనాయక్ , ఎం.నారాయణ, వి.ధర్మరాజు,బి. లోహిదాస్, గిన్ని బాలరాజు, మురళి, యాదవ రెడ్డి, నాగమ్మ, దేవరాజు, బీమారాజు, సిమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జీవితానికి కష్టపడాలి



**ఇచ్ఛాపురం, అక్టోబరు 8(వార్త):** ఇంటర్మీడియటీ విద్యార్థులు కేవలం పరీక్షల కోసం కాకుండా ఉన్నత ప్రమాణాలూ కూడిన ఉత్తమ జీవితాన్ని గడప డానికి శ్రమించాలని జిల్లా వృత్తి విద్యా అధికారి సురేష్ కుమార్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు.. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందిలో మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేప్పంలో సంయం ఉపాధికై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ఇంటర్మీయిట్ దశ నుంచే నైపుణ్యాలను మెరుగుపరచుకవాలన్నారు. గతంట ఎన్నడు లేని విధింగా పుస్తకాలు, నోటు పుస్తకాలు,, భోజనం పథకం ఇలా అన్నీ ప్రభుత్వం సమకూరుస్తున్నా నాణమైన వి అందిస్తే ప్రభుత్ర కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయిరీన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ప్రవేశాల పరంగా కర్నూల్ తరువాత రెండో స్థానంలో నిలువడం వెనుక, విద్యార్థులు తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషి అభినందనీమమని అన్నారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి , , సుధాకర్, ఎన్. ఎస్. ఎస్. వి.ఒ. ఎస్. రజనీకుమారి, ఎన్. బాపూజీ, యుగంధర్, పి. ప్రసాదరావు, కరుణాకర్, జనార్ధనరావు, జగదీష్,యోగి తదితరులు పాల్గొన్నారు.

## యువ భారత్ సేవా ఫౌండేషన్ వితరణ

**ఇచ్ఛాపురం, అక్టోబరు 8(వార్త):** ఒడిశా గంజాం జిల్లా బరంగ గ్రామానికి చెందిన అభి అనే యువకుడు రైలు ప్రమాదంలో చెయ్యి, కాలు పోగొట్టుకున్నారు.సుమారు 8 లక్షల రూపాయల వరకు వైద్య ఖర్చులు అయ్యింది. విషయం తెలుసుకున్న తేలుకుంచి యువ భారత్ సేవా ఫౌండేషన్ 10 వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేసింది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# సత్యం మాస్టారుకు అక్షరమే ఆయుధం

**- పోరాటమే ఊపిరిగా బతికిన మానవతావాది**

**- పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసిన**

## కామ్రేడ్ కొల్లి సత్యనారాయణ

**మందస, అక్టోబరు 8(వార్త):** కొందరు బతుకుతారు... కొందరు బతికిస్తారు... కానీ కామ్రేడ్ కొల్లి సత్యనారాయణమాస్టర్ లాంటి అరుదైన నాయకులు మాత్రమే ఒక తరానికి దారి చూపుతారు. ఆయన ఒక వ్యక్తి కాదు... ఒక ఉద్యమం. పేద పక్షాన పోరాడిన వేగుచుక్క ఆయన. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగిన ఆయన పోరాటాల పుట్టినిల్లైన మందస ప్రజలకు సేవలందించారు. ఆయనే కామ్రేడ్ కొల్లి సత్యన్నారాయణమాస్టారు. సత్యంమాస్టారుగా పేరొందిన ఆయన జీవితం ఇలా సాగింది.

### అక్షర దీపం వెలిగించిన గురువు

తూర్పు గోదావరి జిల్లా నుంచి ఉపాధ్యాయుడిగా మందస గడ్డపై అడుగు పెట్టినప్పటి నుంచి ఆయన లక్ష్యం ఒక్కటే-ప్రతీ పేద ఇంట్లో అక్షర జ్యోతి వెలగాలి. తరగతి గదిలో ఆయన చెప్పిన పాఠాలు విద్యార్థులకు జీవిత పాఠాలయ్యాయి. ఎంతో మంది నిరుపేద విద్యార్థులను తన సొంత ఖర్చుతో చదివించి, వారిని ప్రయోజకులను చేసిన గొప్ప మనస్సు ఆయనది. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఈ రోజు ఎన్నో ఉన్నత స్థానాల్లో ఉండి, “మా జీవితానికి మాస్టరే కారణం” అని కృతజ్ఞతతో చెబుతుంటే ఆ మాటల్లోనే ఆయన గొప్పతనం తెలుస్తుంది.

### పేదల పెన్నిధి, కార్మికుల అండ

మందస, సోంపేట, కంచిలి తదితర మండలాల్లోని మారుమూల గిరిజన గూడేలే ఆయన కార్యక్షేత్రం. కాలినడకన, సైకిల్ పై తిరుగుతూ, గిరిజనుల కష్టాలను స్వయంగా తెలుసుకునేవారు. భూమి లేని పేదలకు భూమి పట్టాలు ఇప్పించడం, కూలీలకు కనీస వేతనం పెంచడం, గిరిజనులకు అటవీ హక్కులు సాధించడం కోసం ఆయన చేసిన నిరంతర పోరాటం ఫలితంగా వందలాది కుటుంబాల్లో నేడు వెలుగు నిండింది. ఎవరికి కష్టం వచ్చినా, ఏ అన్యాయం జరిగినా “మాస్టర్ కు చెబితే చాలు” అనే ధైర్యం ప్రజలకు ఉండేది. ఆయన ఇల్లు



ఒక ఇల్లు కాదు, అది పేదలకు న్యాయ మందిరం. ఆ ఇంటి తలుపులు 24 గంటలూ పేదల కోసం తెరిచే ఉండేవి.

### నిరాడంబరతకు నిలువెత్తు రూపం:

ఈ రోజుల్లో రాజకీయం అంటేనే డబ్బు, హోదా, ఆర్భాటం అనుకుంటున్న కాలంలో, సత్యం మాస్టర్ జీవితం ఒక సందేశం. జీవితాంతం ఒక సాధారణ చొక్కా, పేంటు చేతిలో సంచి, చిరునవ్వుతో కనిపించే ఆయనలో ఎప్పుడూ ఆడంబరం లేదు. ఉపాధ్యాయుడిగా వచ్చినా కమ్యూనిస్ట్ గా తన జీవితం పార్టీ కోసం, ప్రజా ఉద్యమాల కోసం త్యాగం చేసిన మహా త్యాగి.

### ఎర్రజెండాకు బలమైన వెన్నెముక

శ్రీకాకుళం జిల్లాలో సీపీఎం, సీఐటీయు ఉద్యమాలను భుజాలపై మోసిన నాయకుడు సత్యంమాస్టర్. పోలీసు నిర్బంధాలు, ప్రలోభాలు, బెదిరింపులు ఏవీ ఆయన నిబద్ధతను వీడలేకపోయాయి. సిద్ధాంతం పట్ల అచంచలమైన విశ్వాసం, ఆచరణలో నూరు శాతం నిజాయితీ ఉన్న నేతగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు.

### భావితరాలకు ఆదర్శం

ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన నాటిన ఆలోచనలు, వేసిన పోరాట బాట ఈ గడ్డపై సజీవంగా ఉన్నాయి. నేటి యువతకు సత్యం మాస్టర్ జీవితం ఒక దిక్సూచి. నిస్వార్థ సేవ అంటే ఏమిటో, ప్రజల కోసం బతకడం అంటే ఏమిటో ఆయన జీవితం చూపిస్తుంది.

ఈ నెల 10న జరగబోయే 3వ వర్ధంతి సదస్సు కేవలం సంతాప సభ కాదు... అది ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, పేదల పక్షాన నిలబడతామని ప్రతి ఒక్కరం ప్రతిజ్ఞ చేసే మహా వేదిక. ప్రతి ఒక్కరూ తప్పక పాల్గొని, ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పించాలి. కామ్రేడ్ కొల్లి సత్యనారాయణ మాస్టర్ స్ఫూర్తి అజరామరం.




## అథ్లెటిక్స్ పోటీల్లో జ్ఞానభారతి విద్యార్థుల ప్రతిభ




**ఇచ్ఛాపురం, అక్టోబరు 8 (వార్త):** విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో జ్ఞాన భారతి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాలలో విజేతలైన విద్యార్థులకు ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల రెండవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు విజయవాడలో ఈ పోటీలను నిర్వహించారు. మా పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న కె ప్రవీణ్ ఐదు కిలోమీటర్ల నడక పందెంలో రెండవ స్థానాన్ని సాధించి వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. డెకట్లాన్ క్రీడాంశంలో మహమ్మద్ అమ్రాన్ అక్మల్ రెండవ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. వి. అఖిల్ షార్ట్ పుట్ క్రీడాంశంలో మూడవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. జోహార్ ఖాన్ గారు వీరిని పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.బి పండా, కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్ బెహరా, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**- కోటబొమ్మాళి--తిలారు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తింపు**

**- మృతుడి వయస్సు 30-40 ఏళ్ల మధ్య ఉన్నట్లు అంచనా**

**- వివరాల కోసం పలాస జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని సూచన**



**జలుమూరు, అక్టోబరు 8 (వార్త):** పలాస జీఆర్పీ రైల్వే పోలీసుల పరిధిలోని కోటబొమ్మాళి-తిలారు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. రైల్వే కిలోమీటర్ నంబర్ 723/57 వద్ద మృతదేహాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహంపై సిమెంట్ రంగు షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు వివరించారు. అయితే మృతుడి పూర్తి వివరాలు, గుర్తింపు ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి గురించి సమాచారం తెలిసిన వారు లేదా అతడిని గుర్తించగలిగిన వారు పలాస జీఆర్పీ రైల్వే స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసరావును 9247585743 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## మండపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 8(వార్త):** జిల్లా సెక్రటరీ, సీనియర్ జడ్జ్ కె.హరిబాబు ఆధ్వర్యంలో మండపల్లి లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ద్వారా ఎస్ పి అర్ ఊహ స్కీమ్ మరియు ఇతర స్కీమ్ లు గురించి తెలియజేసారు.అలాగే ప్రభుత్వ విధానాల గురించి వివరించారు. ప్రతి మండల పరిధిలో 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చు అని తెలియజేసారు. ఇచ్ఛాపురం కోర్ట్ నుండి డి. కృష్ణ మూర్తి రెడ్డి 40 గంటల మీడియషన్ ట్రైనింగ్ తీసుకున్నారు అతని ద్వారా ఇచ్ఛాపురం కోర్ట్ లో పెండింగ్ కేసులు ఒక్కొక్క కేసు 60 రోజుల్లో పూర్తి చేస్తారని . దీని కోసం డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని అలాగే కోర్ట్ లో కట్టినటువంటి ఫీజు తిరిగి ఇచ్చి వేస్తారని మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా సమయం, డబ్బు, వనరులు మరియు శ్రమ ఆదా అవుతాయని అన్నారు.ఇది మానసిక వేదనను తగ్గిస్తుందని మరియు ఒకవేళ కేసు కోర్టులో ఉంటే కోర్టు ఫీజు కూడా తిరిగి వస్తుందని మీడియషన్ ట్రైనింగ్ అడ్వకేట్ డి. కృష్ణ మూర్తి రెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నందికి రమణయ్య రెడ్డి, సెక్రటరీ యం. రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ ప్రేమలత పట్నాయక్ సంయుక్త కార్యదర్శి మరియు మీడియేషన్ ట్రైనింగ్ అడ్వకేట్ డి. కృష్ణ మూర్తి రెడ్డి , ఏ జి పి నాగరాజు పాత్రో, న్యాయవాదులు గిన్ని సీతయ్య రెడ్డి, తరుణ్, భీమారావు రెడ్డి, సోమేశ్వరరెడ్డి, తహసీల్దార్ వెంకటరావు , ఎంపీడీఓ ప్రభాకర్ రావు , మాజీ సర్పంచ్ ప్రతినిధి పి. మామయ్య, ఐ సి డి ఎస్ కే శ్రీ లతా , పారా లీగల్ వాలంటీర్ పద్మనాభం సాహు, కోర్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.




# సంక్షేమం, అభివృద్ధిలకు ప్రభుత్వం పెద్దపీట



**మందస, అక్టోబరు 8(వార్త):** సంక్షేమం, అభివృద్ధిలకు పెద్దపీట వేస్తోందని, కూటమి ప్రభుత్వంతోనే మౌలిక సదుపాయాలు కల్పించబడుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస నియోజవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని హరిపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, యువతకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించే లక్ష్యంతో మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర పౌర విమాన యాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథ్యంతో హరిపురం రోడ్డులో రూ.75 లక్షల వ్యయంతో సెంటర్ డివైడర్, లైటింగ్ పనులకు, అలాగే హరిపురం గ్రామం వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో మినీ స్టేడియం నిర్మాణానికి శంకు స్థాపన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. రూ.75 లక్షలతో చేపట్టనున్న సెంటర్ డివైడర్, లైటింగ్ పనులతో హరిపురం ప్రధాన రహదారి మరింత సుందరంగా మారడంతో పాటు రాత్రి వేళల్లో ప్రజలకు, వాహనదారులకు మెరుగైన వెలుతురు, భద్రత కలుగనుందన్నారు. సెంటర్ డివైడర్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా మరింత అవకాశం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా రూ.2.50 కోట్లతో నిర్మించనున్న మినీ స్టేడియం ఈ ప్రాంత యువతకు, విద్యార్థులకు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి మెరుగైన శిక్షణ, సాధనకు అవసరమైన వేదికను అందించడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు మాత్రమే కాదని, యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం కూడా అన్నారు. హరిపురం ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓట్ బచావో--దేశ్ బచావో నినాదంతో నిరసన ర్యాలీ



**శ్రీకాకుళం, అక్టోబరు 8 (వార్త):** ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం నగరంలో ‘ఓట్ బచావో-దేశ్ బచావో’ నినాదంతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని బ్లాక్ డేగా పాటిస్తూ చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కృపారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, న్యూ డెమొక్రటిక్ పార్టీ తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డి.గోవిందరావు, కే.మోహన్‌రావు, బవిరి కృష్ణమూర్తి, తాండ్ర ప్రకాష్, డాక్టర్ కిల్లి రామ్మోహన్‌రావు, పేడాడ పరమేశ్వరరావు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, మంత్రి నరసింహమూర్తి, కె.వి.ఎల్.ఎస్. ఈశ్వరి, ఆబోతుల వెంకట్‌నాయుడు, కొత్తకోట్ల సింహాద్రినాయుడు, ఇజ్జురోతు రమణ, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, మామిడి సత్యనారాయణ, బొచ్చ రమణ, కొత్తకోట్ల లక్ష్మి, చాన్‌బాషా, బద్రి సీతమ్మ, గొంటి రామారావు, గొల్లపల్లి దాలయ్య, తంగుడు రమణయ్య, గుంట బారిక అప్పారావు, గుంట కర్ణవీరుడు, తాండ్రోతు గణపతి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పలాసలో అమృత కలశల పంపిణీ



**పలాస, అక్టోబరు 8 (వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అనుగ్రహ ఆశీస్సులతో ప్రముఖ సాంకేతిక సంస్థ ఇన్ఫోసిస్ అందించిన అమృత కలశాలను పలాస శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి సేవా, ఆధ్యాత్మిక ఆశయాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలాస శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అనుగ్రహంతో ఇన్ఫోసిస్ సంస్థ అందించిన అమృత కలశాలను సేవా భావంతో పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి బోధనలు, సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ బైరాగి మాస్టారు, పుట్టపర్తి యాత్ర శ్రీనివాస్ మాస్టారు, శ్రీ సత్యసాయి విద్యా విహార్ చైర్మన్ మల్ల రామేశ్వరరావు, తాలసు శ్రీనివాసరావు, మల్ల శరత్, డోకు జగదీష్, జామి చిరంజీవి శ్రీనివాసరావు, పొట్నూరు కొండలరావు, తాలసు సూర్యప్రకాశ్, యువజన విభాగం నాయకుడు రాజేష్, కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటలో తెగుళ్లను నివారించాలి



**నరసన్నపేట, అక్టోబరు 8 (వార్త):** ఇటీవల కురిసిన వర్షాలు, తుపాను ప్రభావంతో వరి పొలాల్లో కొన్ని రోజులపాటు నీరు నిలిచిపోవడం, అనంతరం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని నరసన్నపేట మండల వ్యవసాయ అధికారి వై. సూర్యకుమారి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి పంటను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పొలాల్లో నీరు ఎక్కువకాలం నిలవడం, వాతావరణంలో మార్పులతో వరి పంటలో కుళ్లు తెగులు, పాముపొడ తెగులు కనిపించే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంటకు నష్టం వాటిల్లకుండా చూడవచ్చన్నారు. కుళ్లు తెగులు, పాముపొడ తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొపైకొనాజోల్ లేదా 400 మిల్లీలీటర్ల హెగ్జాకొనాజోల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అలాగే తెగుళ్ల నియంత్రణ కోసం ఎకరాకు 150 మిల్లీలీటర్ల తిఫ్లూజామైడ్ను కూడా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. వరి పొలాల్లో పంట పరిస్థితిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని వై. సూర్యకుమారి రైతులకు సూచించారు.

## ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలి

**ఇచ్ఛాపురం, అక్టోబరు 8 (వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ బలగం ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ కాళ్ల జైదేవ్, మరియు రైల్ యూజర్స్ కమిటీ సభ్యులు సౌత్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహారా కు వినతి పత్రం సమర్పించారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల సౌకర్యం, భద్రత మరియు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అంశాలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రంలో ప్రధానంగా రిజర్వేషన్ కౌంటర్ సమీపంలోని వెయిటింగ్ ఏరియాలో పెద్ద ఫ్యాన్, కుర్చీలు ఏర్పాటు చేయాలని, రిక్విజిషన్ ఫారాలు రాసుకునేందుకు రైటింగ్ స్లాబ్/టేబుల్ ఏర్పాటు చేయాలని, 1, 2వ నంబర్ ప్లాట్‌ఫారమ్‌లపై ప్రయాణికులకు కూర్చునే సదుపాయాలను పెంచాలని కోరారు. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3, 4వ ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి/విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, తద్వారా ఇచ్ఛాపురం నుంచి మరిన్ని రైళ్లను ప్రారంభించే అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎం.తోటూరు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు మరియు దివ్యాంగులకు ఉపయోగకరంగా ఉండేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద ర్యాంప్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు స్టేషన్‌ను పరిశీలించి, సాధ్యమైన మేరకు సమస్యలను పరిష్కరించాలని బలగం ఫౌండేషన్ సభ్యులు మరియు రైల్ యూజర్స్ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో బలగం ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ కాళ్ల జైదేవ్ తో పాటు అధ్యక్షులు కాళ్ల సిద్ధు, ఉపాధ్యక్షులు కొరికాన అవినాష్, ఇచ్ఛాపురం రైల్ యూజర్స్ కమిటీ సభ్యులు దేవరపల్లి గోపాల్ రావు, బలివాడ రాము, కిల్లంశెట్టి అనిల్ కుమార్, గోళ్ళ రమేష్, వల్లంపాటి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.ప్రజల సౌకర్యం, ఇచ్ఛాపురం అభివృద్ధి లక్ష్యంగా బలగం ఫౌండేషన్ నిరంతరం ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తుందని ఈ సందర్భంగా కాళ్ల జైదేవ్ తెలిపారు.



## లీడర్ రమణమూర్తిపై కేసులు ఎత్తివేయాలి

**పలాస, అక్టోబరు 8 (వార్త):** పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంతో పాటు ‘లీడర్’ పత్రిక నిర్వాహకుడు రమణమూర్తిపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. బొడ్డపాడు గ్రామంలో ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక ఆధ్వర్యంలో అమ్మ రామకృష్ణ అధ్యక్షతన గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ రామకృష్ణ మాట్లాడుతూ రమణమూర్తిపై నమోదు చేసిన రెండు కేసులు పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. గీతం భూములు, ముదపాక భూ వ్యవహారాలు, బిట్‌కాయిన్ వ్యవహారాలు, ప్రభుత్వ విధానాలపై ‘లీడర్’ పత్రికలో వార్తలు ప్రచురించినందుకే రాజకీయ కక్షతో కేసులు నమోదు చేశారని సమావేశం అభిప్రాయపడిందన్నారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించేందుకు మీడియా వర్గాలు, ప్రజాస్వామిక శక్తులు, ప్రజా సంఘాలు ఐక్యంగా స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విమానాశ్రయ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు గోరకల బాలకృష్ణ, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు మద్దిల రామారావు, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కోర్రాయి నీలకంఠం, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, పి.ఓ.డబ్ల్యూ. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, ఉరసం ప్రధాన కార్యదర్శి కుత్తుం వినోద్, జిల్లా కన్వీనర్ జగన్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యకర్తలు మోహినమ్మ, రాజేశ్వరి, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు అప్పయ్యతో పాటు శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546